TGTEL/26/A5513

వార్తదీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 62 | 31 శనివారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చి కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు.

...మిగతా 2 లో...

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం.

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన




మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్‌ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.



నిలేక తిరుగు తున్నానా? .. రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను: ఈటల రాజేందర్


- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర
- ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక
- నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- డీవియేషన్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్
- డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన



జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాద యాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభు త్వంపై తీవ్రస్థాయిలో విరుచు కుప డ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలి ంచేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభు త్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగ దని ఆయన హెచ్చరించారు. పని లేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. ...మిగతా 2 లో...

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి
- రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి
- విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ



ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు.

...మిగతా 2 లో...

కన్నడిగులకే ఉద్యోగాలు..

కర్ణాటకలో ఐటీ కంపెనీలపై ఒత్తిడికి కరవే పిలుపు

- ఐటీ, బీటీ కంపెనీలలో కన్నడిగులకు ఉద్యోగాల కోసం ఉద్యమం
- నవంబర్ 1 నుంచి నెల రోజుల పాటు కరవే ఆందోళన
- స్థానిక నియామకాలపై కంపెనీల నుంచి వివరాల సేకరణ
- కన్నడిగులకు అన్యాయం చేస్తే చర్యలు తప్పవన్న సీఎం శివకుమార్



కర్ణాటకలోని ఐటీ, బయోటెక్నాలజీ (బీటీ) కంపెనీలలో కన్నడిగులకు ఉద్యోగావకా శాలు పెంచాలన్న డిమాండ్‌తో కన్నడ అనుకూల సంస్థ 'కర్ణాటక రక్షణ వేదిక' (కరవే) ఉద్యమానికి పిలుపునిచ్చింది. నవ ంబర్ 1న కర్ణాటక రాజ్యోత్సవం సంద ర్భంగా ఈ ఆందోళన ప్రారంభించి, నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిం చనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, కరవే పలు బృందాలను ఏర్పాటు చేయనుంది. ఒక్కో బృందంలో 10 మంది నాయకులు, కార్యకర్తలు ఉంటారు.

...మిగతా 2 లో...

జగ్గారెడ్డిని కలిసిన టిడబ్ల్యూయూ నాయకులు

సంగారెడ్డి, అక్టోబర్ 30, వార్త దీపిక న్యూస్ :

మెదక్ జిల్లా క్లాసిక్ (6) టిడబ్ల్యూయూ విజయం సాధించిన సందర్భంగా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ నాయకులు కలవడం జరిగింది.



TGTEL/26/A5513 వార్త దీపిక

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

మొదటిపేజీ తరువాయి

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు. 2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర.. 24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన మాటను వెంటనే అమలు చేసిన ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. చెన్నై గిండిలోని ప్రభుత్వ వృత్తివిద్యా శిక్షణ సంస్థలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేశ్ అనే దివ్యాంగ యువకుడు సీఎంను కలిసి, తాను నిరుద్యోగినని, జీవనం కష్టంగా ఉందని సైగలతో వివరిస్తూ ఓ వినతిపత్రాన్ని అందించాడు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న విజయ్, తప్పకుండా సాయం చేస్తానని అక్కడికక్కడే భరోసా ఇచ్చారు.అనుకున్నదే తడవుగా, మరుసటి రోజైన గురువారం ఉదయం దినేశ్‌ను సచివాలయానికి పిలిపించారు. అక్కడ సీఎం విజయ్ స్వయంగా దినేశ్‌తో కరచాలనం చేసి, ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. తిరువొత్తియూరులోని ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో సహాయకుడి పోస్టును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విజ్ఞప్తి చేసిన ఒక్క రోజులోనే ఉద్యోగం రావడంతో దినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన కష్టాన్ని అర్థం చేసుకుని తక్షణమే స్పందించిన సీఎం విజయ్‌కు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. ప్రజాప్రతినిధులు సమస్యలపై వెంటనే స్పందించాలనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది.

కన్నడిగులకే ఉద్యోగాలు..

కర్ణాటకలో ఐటీ కంపెనీలపై ఒత్తిడికి కరవే పిలుపు

మొదటిపేజీ తరువాయి

వీరు రాష్ట్రంలోని ఐటీ, బీటీ కంపెనీలను సందర్శించి, యాజమాన్యాలు, హెచ్‌ఆర్ అధికారులతో సమావేశమవుతారు. కంపెనీలో ఎంతమంది కన్నడిగులు పనిచేస్తున్నారు, స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఎలాంటి విధానాలు పాటిస్తున్నారు, అర్హత ఉన్నప్పటికీ కన్నడిగులకు ఎందుకు అవకాశాలు దక్కడం లేదనే అంశాలపై వివరణ కోరుతూ విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తారు.కర్ణాటక భూమి, నీరు, మౌలిక సదుపాయాలను వాడుకుంటున్న కంపెనీలు స్థానికుల ఉద్యోగ ఆకాంక్షలను గౌరవించాలని కరవే స్పష్టం చేసింది. ఐటీ రంగంలో కన్నడిగులు సమర్థులైనప్పటికీ వారికి తగిన అవకాశాలు ఇవ్వడం లేదని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో స్థానిక ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నారు.ఈ అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇటీవలే స్పందించారు. బెంగళూరులోని ఐటీ కంపెనీలు కావాలనే కన్నడిగులను ఉద్యోగాలకు దూరంగా ఉంచుతున్నాయనే ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అక్టోబర్ 25న ఆయన హెచ్చరించారు. స్థానికులకు అన్యాయం జరుగుతున్నట్లు తేలితే ప్రైవేట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, కన్నడిగుల హక్కులు, ఉద్యోగావకాశాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో కరువు పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష

వార్త దీపిక న్యూస్

నాగర్ కర్నూల్ జిల్లాలో 13 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కరువు పరిస్థితులపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ చేయాలి బోర్లు, చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల పరిస్థితిని పరిశీలించాలి నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించాలి అవసరమైన గ్రామాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి వ్యవసాయ, ఉద్యాన శాఖలు పంటల నష్టంపై సమగ్ర అంచనా వేయాలి సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలపై నిరంతర పరిశీలన చేయాలి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దిష్ట సమయంలో నివేదికలు సమర్పించాలి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

బాలల భద్రతకు చట్టాలపై అవగాహనే రక్షణ కవచం

వార్త దీపిక న్యూస్

బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడంతో పాటు, వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో సీనియర్ సివిల్ జడ్జ్ పి.బి కిరణ్ కుమార్ హుజురాబాద్ చట్టం పైన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరిస్తూ, మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను, అసభ్య ప్రవర్తనను గుర్తించే విధానాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం చట్టరీత్యా శిక్షార్హమని, ఇలాంటి ఘటనలను దాచిపెట్టకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి తన హక్కులను తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని తెలిపారు. బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు, బాధిత బాలబాలికలకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలేక తిరుగు తున్నానా? .. రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను: ఈటల రాజేందర్

మొదటిపేజీ తరువాయి

"డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాద యాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.







ఆదివాసీల హక్కులను గౌరవించాలి.. అడవుల సంరక్షణ అందరి బాధ్యత : డి,ఎఫ్,ఓ బాలమణి

వార్త దీపిక న్యూస్



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో డీ,ఎఫ్,ఓ బాలమణి ఆదివాసీ హక్కుల పోరాట సమితి 'తుడుందెబ్బ' ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశం సౌహార్ద వాతావరణంలో జరిగింది. ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ శాఖ నిబంధనలు, ఆదివాసీల హక్కులు, క్షేత్రస్థాయి సమస్యలు, అటవీ సంరక్షణపై సుదీర్ఘంగా చర్చించారు. ఆదివాసీల చట్టాలను గౌరవించాలి: తుడుందెబ్బ ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ.. లిఏజెన్సీ ప్రాంతాలలో అటవీ శాఖ అధికారులు 1/70 చట్టం, పెసా (గ్రామసభ) చట్ట నిబంధనలను తప్పనిసరిగా గౌరవించాలి. లిఆదివాసీ గ్రామాలలో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిబంధనల పేరిట అడ్డుకోవద్దు. తరతరాలుగా అడవులను కాపాడుతున్న ఆదివాసీలను వేధించవద్దు. సంస్కృతి, సాంప్రదాయ పండుగల పూజా కార్యక్రమాలకు అవసరమైన కట్టెలు తెచ్చుకునే విషయంలో ఇబ్బంది పెట్టవద్దు. లిఏజెన్సీ పరిధిలోని అటవీ శాఖ నియామకాలు, కాంట్రాక్టు పనుల్లో స్థానిక ఏజెన్సీ ఆదివాసీలకే ప్రాధాన్యత కల్పించాలి. ఆదివాసీలకు అన్యాయం జరగనంత కాలం అటవీ పరిరక్షణలో అటవీ శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. సాంప్రదాయాలకు అడ్డంకులు ఉండవు : డీ,ఎఫ్,ఓ తుడుందెబ్బ నాయకుల విజ్ఞప్తులపై డి,ఎఫ్,ఓ బాలమణి సానుకూలంగా స్పందిస్తూ.. ఆదివాసీల సంస్కృతి, పండుగల విశిష్టత తమకు తెలుసని, దైవ కార్యక్రమాలకు అవసరమైన కట్టెలకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వెదురు బొంగులను శాస్త్రీయ పద్ధతిలో కత్తిరించడం వల్ల నాలుగు రెట్లు ఉత్పత్తులు పెరుగుతాయని, నిర్దేశిత పరిమితి మేరకే జరగాలని సూచించారు. అటవీ సంపదను వ్యాపార కార్యకలాపాలకు తరలించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వల్ల ఇబ్బందులు తలెత్తితే తక్షణమే తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని, విచారణ చేపట్టి న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు కోట్నాక విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్, ముఖ్య సలహాదారు కనక ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ, ఉపాధ్యక్షులు కొట్నాక రాంశావ్, వెడ్మ భగవంత్ రావ్, జిల్లా కార్యదర్శి సిడాం నాగోరావు, లింగాపూర్ మండల అధ్యక్షులు పెంధోర్ ప్రకాష్, తీర్యాణి మండల విద్యార్థి సంఘం అధ్యక్షులు రాయ్ సిడాం జంగు, నాయకులు ఆడె సోమేష్, మడావి పురుషోత్తం, కోట్నాక వినేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా.. మళ్లీ మారిన షెడ్యూల్

మొదటిపేజీ తరువాయి

అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది. గణాంకాల వివరాలు ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు. అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గానూ 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు. ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీరిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదం లభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

సహస్ర ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, క్యాంటీన్, డయాలసిస్ ప్రారంభం

ఎద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు





సంగారెడ్డి, అక్టోబర్30, వార్త దీపిక న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని సహస్ర ఆసుపత్రిలో మరో కీలక ముందడుగు పడింది. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ వార్డు, ఈహెచ్ఎస్ సేవలు, క్యాంటీన్, డయాలసిస్ విభాగాలను ఆసుపత్రి యాజమాన్యం శుక్రవారం ప్రారంభించింది. ఈ విభాగాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రముఖులు హాజరయ్యారు. ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన పేదలకు వైద్య సేవలు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ పథకం ద్వారా వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా డయాలసిస్ అవసరమైన రోగులకు ప్రత్యేక సేవలు, రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కె. రాజు గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన పట్టభద్రుడు ఓటరు నమోదు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ పైలెట్ రోహిత్ రెడ్డి

తాండూర్, అక్టోబర్ 30, వార్త దీపిక న్యూస్ :

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పట్టణంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో ఉపాధ్యాయలతో సమావేశమయ్యారు గంగోత్రి విద్యాలయ హై స్కూల్, నేతాజీ గురుదేవ్ గురుకుల్ స్కూల్, సెయింట్ మార్క్ హై స్కూల్,సెంట్ మేరీ హై స్కూల్ అక్షర కాన్సెప్ట్ హై స్కూల్ పల్ పాఠశాలను సందర్శించి,ఉపాధ్యాయులను కలిసి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల ఓటరు జాబితాలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాకు తేడా ఉంటుందని వివరించారు. గతంలో ఓటరుగా నమోదు చేసుకున్న వారు కూడా ఈ సారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6న చివరి తేదీ కావడంతో ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు కుటుంబ సభ్యులలో అర్హులైన పట్టభద్రులు ఉంటే వారిని కూడా ఓటర్లుగా నమోదు చేయించే



బాధ్యత తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది కలగకుండా తాము స్వయంగా పాఠశాలల వద్దకే వచ్చి నమోదు ప్రక్రియ పూర్తిచేసేలా సహకరిస్తామని తెలిపారు. దరఖాస్తు సమయం లో ఆధార్ కార్డు డిగ్రీ సర్టిఫికెట్ ఓటర్ ఐడి కార్డు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ శ్రీశైలం రెడ్డి, తాండూర్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కళా ప్రతిభకు "సాధన 2026"వేదిక

సంగీతం, నృత్యం,నాటకం, దృశ్య కళల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

సృజనాత్మకత, నైపుణ్యాలు, అభ్యసన ప్రగతిని చాటిన గీతం విద్యార్థులు











పటాన్‌చెరు, అక్టోబర్ 30, వార్త దీపిక న్యూస్ :

విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీస్తూ, వారి సృజనాత్మకతకు వేదికగా 'సాధన 2026' నిలిచింది. హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డాన్స్ స్టూడియోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐచ్ఛిక కోర్సుల్లో భాగంగా కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, నాటకం, దృశ్య కళలను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో బృందాలుగా ఏర్పడిన విద్యార్థులు శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలు, కళాత్మక భావాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సంగీత ప్రదర్శనలకు మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్‌పై వాసు శాస్త్రి సహకారం అందించారు.ప్రత్యక్ష వాయిద్య సహకారంతో వేదికపై ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమ ప్రత్యేకతగా నిలిచింది. తద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంగీత సమన్వయం, గాత్ర, నృత్య ప్రదర్శనలకు అవసరమైన నైపుణ్యాలు మెరుగుపడ్డాయి.విద్యార్థులు ప్రేక్షకుల ముందు తమ కళాత్మక సామర్థ్యాలను ప్రదర్శించేందుకు సాధన 2026 మంచి అవకాశంగా నిలిచింది. మధ్యంతర మూల్యాంకనంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలు, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, ప్రదర్శన సామర్థ్యాలను అంచనా వేసేందుకు అవకాశం కలిగింది. విద్యార్థుల అంకితభావం, ఉత్సాహం, కళాత్మక ఎదుగుదలపై అధ్యాపకులు, తోటి విద్యార్థులు ప్రశంసలు కురిపించారు.అనుభవపూర్వక అభ్యసనానికి, కళాత్మక నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ వర్ధమాన కళాకారులను ప్రోత్సహించడంలో గీతం విశ్వవిద్యాలయం నిబద్ధతను సాధన 2026 మరోసారి చాటిచెప్పింది.

ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభం

తాండూర్, అక్టోబర్ 30, వార్త దీపిక న్యూస్ :

బషీరాబాద్ మండల్ రెడ్డిఘనపూర్ గ్రామంలో రూ. 68.60 లక్షలతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు 10 లక్షలతో ఎస్సీ వార్డులో సైడ్ బ్రానేజ్, సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 6 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభం, రూ. 10 లక్షలతో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ 13.60 లక్షలతో మండల ప్రజా పరిషత్ పాఠశాల, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ.9 టలక్షలతో రైతులకు మట్టి రోడ్డుకు శంకుస్థాపన, రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవం, కురువ విజయలక్ష్మి రాములు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంబించారు. అనంతరం 444 స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మండల అధికారులు సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





గాంధీనగర్ అభివృద్ధే లక్ష్యం..!

కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్

తాండూర్, అక్టోబర్ 30, వార్త దీపిక న్యూస్ :

తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ వార్డులో పారిశుద్ధ్యం, పలు అభివృద్ధి పనులు మెరుగుదలకు చర్యలు చేపట్టారు. శుక్రవారం గాంధీనగర్ ఎంట్రన్స్ లోని స్లాటర్ హౌస్ ముందు గల కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించడం జరిగింది. వార్డు ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడంతోపాటు గాంధీనగర్ ను స్వచ్ఛమైన వార్డుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అనే కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గాంధీనగర్ అభివృద్ధే లక్ష్యం గా పనిచేస్తూ ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.



కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

తాండూర్, అక్టోబర్ 30, వార్త దీపిక న్యూస్ :

పట్టణ ప్రజలకు వ్యాపారవేత్తలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం శుభ పరిణామం అని రాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రముఖ వ్యాపారవేత్త కల్వరాధాకృష్ణ అన్నారు. పట్టణంలో కరూర్ వైశ్య బ్యాంకు నూతన శాఖను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు కరూర్ వైశ్యా బ్యాంక్ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న తన బ్యాంకింగ్ సేవలో భాగంగా 923వ శాఖను తాండూర్ లో ఏర్పాటు చేసింది, ఘనాపూర్ వార్డు లోని ముదిల్లి నారాయణ మార్గంలో ఏర్పాటు చేసిన ఈ నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కల్వ రాధాకృష్ణ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సేవలను ప్రజలు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ స్థానిక వ్యాపార అభివృద్ధికి బ్యాంకు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి గాయత్రి దీపాన్ని వెలిగించగా గ్రీన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం వీరేందర్ సేఫ్ రూమ్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్య బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మదీనా వెంకట సతీష్ కుమార్ డిప్యూటీ జనరల్ మేనేజ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

విద్యార్థులు చదువుతో పాటు కళలు ,సంస్కృత కార్యక్రమాల్లో రాణించాలి





--జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

వార్త దీపిక న్యూస్

మెదక్ జిల్లాలోని 31 పి యం శ్రీ పాఠశాలల విద్యార్థులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి ఆర్ట్ అండ్ కల్చర్ పోటీలు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 31 పి యం శ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈ పోటీలు నిర్వహించి అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహించడం జరిగింది. మొత్తం నాలుగు విభాగాలలో (Art - Dance - Music - Craft) నిర్వహించిన ఈ పోటీలలో ఒక్కొక్క పాఠశాల నుండి ఒక్కొక్క విభాగంలో ఒక్కొక్క స్టూడెంట్ , గైడ్ టీచర్లు పాల్గొనడం జరిగింది. ఇందులో ప్రతి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు మెమెంటో మరియు ప్రశంస పత్రాలు అందజేశారు. నాలుగు విభాగాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు ఒక గైడ్ టీచర్ తో పాటు హైదరాబాదులో నవంబర్ 4వ తారీఖు నాడు రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనవలసి ఉంటుందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు కళల్లోనూ రాణించాలని ఆయన సూచించారు.విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నృత్యం , సంగీతం ,వాయిద్య , సంగీతం ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో కళలు ,సాహిత్యం వైపు దృష్టి మళ్లించడానికి ఇది ఒక చక్కని కార్యక్రమం అని తెలిపారు.

విజేతలు ...

ఆర్ట్ లో తేజస్విని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (శంకరంపేట ఆర్) డాన్స్ లో వైష్ణవి, 10 వ తరగతి, జడ్పీ స్కూల్ (కూసంగి,) సంగీతంలో హర్షవర్ధన్ 8వ తరగతి గురుకుల పాఠశాల (తూప్రాన్) క్రాఫ్ట్ గోవర్ధన్, పదవ తరగతి, (గోమారం) ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సీఎంఓ సుదర్శన్ మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ,వివిధ అంశాలకు సంబంధించిన జడ్జిలు, నిర్వాహకులు పాల్గొనడం జరిగింది.

హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పాఠశాల సందర్శన

వార్త దీపిక న్యూస్ :

హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ఖాజ క్యాంపులో ఎంజేపీ గర్ల్స్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులు, విద్యా సదుపాయాలు, భోజన వసతులు సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ సునీత బాబు, తాళ్ల పెళ్లి రమేష్, వెన్నెల నవీన్, మొగిలి, మహమ్మద్ ఖలీద్, పుణ్య బాబు, భాస్కర్, స్వరూప తిరుపతి, కో ఆప్షన్ సభ్యులు జమదగ్ని, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : కలెక్టర్ హరిత

వార్త దీపిక న్యూస్)

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగది, వంట సామాగ్రి, సరుకుల నిల్వల గదిని పరిశీలించారు. వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినులు, వంట సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహ పరిసరాలు, వంటగది, మూత్రశాలలు, స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జాదవ్ అంబాజీ, వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య విద్యార్థులు బాగా చదివి సమాజానికి పేరు తేవాలి.



మంత్రి శ్రీధర్ బాబు

వార్త దీపిక న్యూస్ :

వైద్య విద్యార్థులు బాగా చదివి, అంకితభావం, సేవా దృక్పథంతో గొప్ప వైద్య నిపుణులుగా ఎదిగి దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆకాంక్షించారు.శుక్రవారం భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు నిర్వహించిన వైట్‌కోట్ వేడుకలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, మానవ సేవకు అంకితమైన పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు. వైద్య విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల జీవితంలో వైట్‌కోట్ ధరించడం ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. వైట్‌కోట్ కేవలం దుస్తువు మాత్రమే కాదని, వైద్య వృత్తిలోని పవిత్రత, నిబద్ధత, సేవాభావానికి ప్రతీక అని వివరించారు. నీట్‌లో అర్హత సాధించి వైద్య విద్యలో ప్రవేశించిన విద్యార్థుల వెనుక తల్లిదండ్రుల కృషి, ం, రోగుల పట్ల ప్రేమ, సానుభూతి, సహనం అలవర్చుకోవాలని సూచించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ వైద్య వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా వైద్య రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎదగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొంటూ సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. కళాశాల భవనంతో పాటు బాలురు, బాలికల హాస్టళ్ల ద్వారా రెండు బస్సుల కొనుగోలుకు రూ.80 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, డీఎంఎఫ్‌టీ నిధుల సహకారంతో త్వరలోనే బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కళాశాల ప్రధాన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన వైద్యులు, అధ్యాపకుల నియామకాలు, ఇతర విద్యా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సెమినార్ హాళ్లకు ఏసీలు, వాటర్ ప్లాంట్, హాస్టళ్లలో లిఫ్ట్, జనరేటర్, కిచెన్ షెడ్ తదితర సౌకర్యాలను కల్పిస్తామని, మిగిలిన పనులను సీఎస్ఆర్ నిధుల సహకారంతో త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



వైద్య కళాశాల అభివృద్ధికి పూర్తి సహకారం: ఎమ్మెల్యే గండ్ర

స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. వైద్య కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి ఉన్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సహకారంతో కళాశాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్లేగ్రౌండ్, లైబ్రరీ, తరగతి గదులు, వాష్‌రూమ్‌లు, హాస్టల్ వసతులు తదితర సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు భూపాలపల్లిని తమ సొంత ప్రాంతంగా భావిస్తూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

91 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయం: కలెక్టర్ రాహుల్ శర్మ

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాల అధ్యాపకుల కృషితో 91 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు.గోదావరి పరివాహక ప్రాంతం, బొగ్గు గనులు, గిరిజన ప్రాంతాలతో కూడిన భూపాలపల్లి జిల్లాలో వైద్య సేవలకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. గతంలో మెరుగైన వైద్య సేవల కోసం వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రి అందుబాటులోకి రావడంతో పాటు సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు.వైట్‌కోట్ ధరించడం విద్యార్థులపై గొప్ప బాధ్యతను ఉంచుతుందని, నిరంతరం విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని సూచించారు.అంతకు ముందు 15 కోట్లతో నిర్మించిన వైద్య బాలికల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ సంకీర్త్, జెన్‌కో చీఫ్ ఇంజినీర్ శ్రీ ప్రకాష్, సర్పంచ్ రజిత, మున్సిపల్ వైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా వెంకట రత్నం, సర్పంచులు, కౌన్సిలర్లు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

---జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

వార్త దీపిక న్యూస్

నర్సాపూర్ ఏరియా ఆసుపత్రినీ డి సి హెచ్ శివ దయాలతో జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, విధుల హాజరుపై ఆరా తీశారు.సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. విధులకు సమయపాలనతో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ వంశి, డాక్టర్లు మీర్జా , గైనకాలజిస్ట్. ప్రేమ వర్ధిని,డాక్టర్ దుర్గా అనస్థీటిస్ట్ సివిల్ సర్జన్ రాము, వసుధ, వీణా ప్రియదర్శిని అన్ని నర్సింగ్ అధికారులు ల్యాబ్ టెక్నీషియన్లు సిబ్బంది పాల్గొన్నారు.





Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984